క్లుప్తంగా

15నుంచి స్పాట్ అడ్మిషన్లు

సూర్యాపేట : బాలెంలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 15 నుంచి 20 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం జనరల్, ఎంపీసీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ), ఎంఎస్‌డీఎస్ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, డేటా సైన్స్), బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ కోర్సులలో మిగిలిపోయిన ఎస్సీ సీట్లను భర్తీ చేయడానికి కళాశాల ప్రాంగణంలోనే స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తారని ఆమె చెప్పారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసి అర్హత కలిగిన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు దోస్త్ ఐడీ, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, బోనఫైడ్, కుల, ఆదాయ పత్రాలు, ఆధార్ కార్డు వంటి సర్టిఫికెట్లను తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7995010881, 9398316225 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 1404 మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఐదు నెలల బకాయిలు చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన పట్టణంలో మాట్లాడారు. వేతనాలు లేక ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి నెలకొందని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సోమిరెడ్డి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారని, ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద నిరవధిక దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలి

తుంగతుర్తి : తుంగతుర్తి మెయిన్ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు వెంటనే మరమ్మతులు చేయించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై ఉన్న గుంతలను చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత నెల 25న సీఎం రేవంత్ రెడ్డికి, రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఈ రోడ్డు దుస్థితి గురించి తెలియజేశామని అన్నారు. దీంతో ఈనెల 3న ఆర్‌అండ్‌బీ అధికారులు వచ్చి రోడ్డును పరిశీలించారని తెలిపారు. అయితే, ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు.

జ్యోతిరావు పూలే విగ్రహాన్ని యథాస్థానంలో నిర్మించాలి


మాట్లాడుతున్న కొత్తగట్టు మల్లయ్య

తిరుమలగిరి : తిరుమలగిరి క్రాస్ రోడ్డులో ధ్వంసమైన జ్యోతిరావు పూలే విగ్రహాన్ని యథాస్థానంలో పునర్నిర్మించాలని పూలే అధ్యయన వేదిక రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య కోరారు. శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక సంఘ నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడారు. జ్యోతిరావు పూలే అధ్యయన వేదిక ఆధ్వర్యంలో 2008 సంవత్సరంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం లారీ ఢీకొట్టడంతో విగ్రహం పూర్తిగా ధ్వంసమైందని, ఈ సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే స్థలంలో విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కందుకూరి సోమయ్య, ప్రవీణ్, రాంప్రభు, ధీన్‌దయాళ్, ఖాసీమ్, లక్ష్మయ్య, యాదగిరి, రాముగౌడ్, వెంకన్న, సోమనారాయణ, మురళీ, రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగారం : పేరబోయినగూడెం గ్రామానికి చెందిన షేక్ ఫకీర్ అహమ్మద్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న వర్ధమానుకోట జెడ్పీహెచ్ఎస్ 2000–2001 టెన్త్ బ్యాచ్‌కు చెందిన అతడి స్నేహితులు శనివారం అతడిని పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం రూ.46,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెట్టి వెంకన్న, ఈదుల అరుణ్, దర్శనం రమేష్, మేడి మల్లేష్, ప్రవీణ్, బి. పోతులూరాచారి, కృష్ణ, మేడోజు సోమాచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

వానొచ్చినా.. తప్పని నిరీక్షణ


పెన్‌పహాడ్ : చీదెళ్ల పీఏసీఎస్ వద్ద వర్షంలో తడుస్తూ నిలుచున్న రైతులు


అర్వపల్లి : పీఏసీఎస్ వద్ద సూర్యాపేట - జనగామ జాతీయ రహదారిపై..


నాగారం : మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద గుమికూడిన రైతులు


పెన్‌పహాడ్ : అనంతారం పీఏసీఎస్ వద్ద క్యూలో ఉంచిన పాసుపుస్తకాలు



అర్వపల్లి : రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

- యూరియా కోసం రోజంతా క్యూలో నిలబడి ఎదురుచూస్తున్న రైతులు
- పలుచోట్ల వర్షం వస్తున్నా తగ్గని రద్దీ

పెన్‌పహాడ్ : యూరియా కోసం రైతులు తిప్పలు పడుతూనే ఉన్నారు. శనివారం మండల కేంద్రంలోని చీదెళ్ల పీఏసీఎస్, అనంతారం గ్రామంలోని నారాయణగూడెం పీఏసీఎస్ కార్యాలయాల వద్ద రైతులు తెల్లవారు జామునుంచే పాసుపుస్తకాలు క్యూలో పెట్టి వర్షంలో తడుస్తూ పడిగాపులు కాశారు. మండల కేంద్రంలోని చీదెళ్ల పీఏసీఎస్ కార్యాలయానికి సాయంత్రం 277 యూరియా బస్తాలు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు రైతుకు ఒక బస్తా చొప్పున అందజేశారు. అదే విధంగా నారాయణగూడెం గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయంలో 444 యూరియా బస్తాలను ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున అందజేశారు. మిగతా రైతులు యూరియా దొరకక తిరిగి వెళ్లిపోయారు. అనంతారం గ్రామంలోని నారాయణగూడెం పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం చాలామంది రైతులు రాత్రి వరకు ఎదురుచూశారు. అయినప్పటికీ యూరియా రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగిపోయారు.

తిమ్మాపురం పీఏసీఎస్ వద్ద పడిగాపులు..

అర్వపల్లి : తిమ్మాపురం పీఏసీఎస్‌కు 220 బస్తాల యూరియా రాగా అక్కడ కూడా పెద్ద సంఖ్యలో రైతులు ఉన్నారు. అక్కడ కూడా రైతుల మధ్య తోపులాట జరిగి చాలాసేపు యూరియా పంపిణీ నిలిచిపోయింది. కొంతసేపు వర్షం పడగా రైతులు వర్షంలోనే తడుస్తూ క్యూలో నిలుచున్నారు.

యూరియా పంపిణీ కేంద్రం పరిశీలన

అర్వపల్లి : అర్వపల్లిలోని యూరియా పంపిణీ కేంద్రమైన పీఏసీఎస్‌ను శనివారం తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రానికి 440 బస్తాల యూరియా వచ్చిందని, దానిని రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం వద్ద గుమికూడిన రైతులతో మాట్లాడుతూ.. ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ గణేష్, కేంద్రం ఇన్‌చార్జ్ మహేందర్, ఏఈఓ సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరకు యూరియా విక్రయాలు!

నాగారం : ఒకవైపు యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ఎరువుల వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నాగారం మండల కేంద్రంలో పీఏసీఎస్ కేంద్రం లేకపోవడంతో ప్రభుత్వం ప్రైవేటు కేంద్రాలకు (ఎరువుల దుకాణాదారులకు) యూరియాను సరఫరా చేస్తుంది. రైతులకు రూ.266కే యూరియా బస్తాను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే రవాణా చార్జీలు భరించి యూరియా సరఫరా చేస్తోంది. కానీ సదరు విక్రయదారులు రవాణా, హమాలీ చార్జీలంటూ రూ.266లకు ఇవ్వాల్సిన యూరియా బస్తాను రూ.310లకు రైతులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

తమ దృష్టికి రాలేదు : ఏఓ

వ్యాపారులు యూరియాను అధిక ధరలకు అమ్ముతున్న విషయమై మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. యూరియా లోడ్ వచ్చినప్పుడు వ్యవసాయ శాఖ అధికారులతోపాటు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అక్కడే ఉంటూ రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఎవరైన వ్యాపారులు అధిక ధరకు యూరియా అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాయుధ పోరాట అమరులకు నివాళి


సూర్యాపేటలో అమరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట : ప్రపంచ చారిత్రాత్మక 'వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సంస్మరణ దినోత్సవాన్ని' సూర్యాపేట పూర్వ విద్యార్థి మిత్ర మండలి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి మిత్ర మండలి అధ్యక్షుడు నల్లగుంట్ల అయోధ్య, ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్ మాట్లాడారు. నాటి నిజాం, రజాకార్ల పాలనలో ప్రజలు అనుభవించిన కష్టాలను, దొరలు, భూస్వాములు, జమీందారులు పాల్పడిన ఘోర కృత్యాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురై నిజాం పాలన ఎలా అంతమైందో, నేటి పాలకులు కూడా దృష్టిలో పెట్టుకుని పాలించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నల్లపాటి అప్పారావు, కార్యదర్శులు సట్టు వెంకన్న, తన్నీరు యాదగిరి, షేక్ సైదులు, వీర్లపాటి వెంకన్న, గీసారాంచందర్, చంద్రమౌళి, దేవత్ కిషన్ నాయక్, బోళ్ల సామిరెడ్డి, శ్రీకాంత్, చిత్రం భద్రమ్మ, బొమ్మిడి లక్ష్మీనారాయణ, చుక్కా యాదగిరి, రాంబాబు, తన్నీరు వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఉద్యోగ విరమణ సన్మానం


ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు కరుణను సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ఆత్మకూర్ (ఎస్) : ఉద్యోగ విరమణ పొందిన గట్టికల్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు మల్లు కరుణను శనివారం ఘనంగా సన్మానించారు. నెమ్మికల్‌లోని దండు మైసమ్మ ఆలయం సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆమెకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమయ్య, అనిల్‌కుమార్ మాట్లాడారు. సుమారు 40 ఏళ్లపాటు ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత కరుణకు దక్కిందన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మల్లు సుధీర్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఉపేందర్ రెడ్డి, కపోతం రెడ్డి, గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

- తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎండీ గౌస్ పాషా


కక్షిదారులకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న జడ్జి

తుంగతుర్తి : రాజీ మార్గమే రాజమార్గమని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎండీ గౌస్ పాషా అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజనం ప్యాకెట్లను కక్షిదారులకు అందించి మాట్లాడారు. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఇద్దరూ గెలుస్తారని తెలిపారు. చిన్నపాటి విభేదాలతో ఆవేశపడి, ఘర్షణలకు దిగి కేసులు పెట్టుకోవడం వల్ల ఇరుపక్షాలు ఆర్థికంగా, మానసికంగా నష్టపోతారని అన్నారు. ప్రజలు కేసుల ద్వారా ఇబ్బందులు పడకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు, ఆర్థిక భారం, సమయం, మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు సుప్రీంకోర్టు జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతి మనిషి మంచి మనసుతో ఆలోచిస్తే తనే ఒక న్యాయమూర్తి అవుతాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపర్తి జ్ఞానసుందర్, వైస్ ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లు, సెక్రటరీ ఎం.రవికుమార్, ట్రెజరర్ బి.సతీష్, నజీర్, నాగరాజు, చంద్రమౌళి, శ్రీనివాస్, పోలీసులు పాల్గొన్నారు.

15న కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని శరత్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సూర్యాపేటలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వైద్య పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పెన్షనర్లు, రెగ్యులర్ ఉద్యోగులు, జర్నలిస్టులు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారు ఈ శిబిరానికి హాజరుకావాలని కోరారు.

ఉపాధి కూలీలకు వరం.. పీఎం సురక్ష బీమా

- రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల వరకు బీమా
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పెన్‌పహాడ్ : వలసలు అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం కూలీలకు వరంగా మారింది. జాబ్‌కార్డులు ఉన్న కూలీలందరికీ ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకం అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే బీమా పథకం లేని కూలీల వివరాలను సేకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. బీమా ప్రీమియంలో కేంద్ర ప్రభుత్వం కొంత మొత్తం చెల్లిస్తుంది, అయితే మిగిలిన మొత్తాన్ని కూలీలు చెల్లించుకోవాలన్న నిబంధన ఉంది.

బీమా అమలుకు నిబంధనలు..

పెన్‌పహాడ్ మండలంలో మొత్తం 11,837 జాబ్ కార్డులు ఉండగా, వాటిలో 8,856 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇందులో 16,162 మంది కూలీలు పనిచేస్తున్నారు. వీరిలో 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న కూలీలు మాత్రమే ఈ బీమా పథకానికి అర్హులు. ఈ నిబంధనల ప్రకారం, కూలీలు జాతీయ బ్యాంకుల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. బ్యాంకు ఖాతా ఉన్న బ్రాంచ్‌లో, తమ ఖాతా నుంచి ఏటా రూ. 20 బీమాకు జమ చేసేందుకు అంగీకార పత్రం అందించాలి. ఈ పథకంలో నమోదు చేసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణించినా లేదా పూర్తిగా అంగవైకల్యం కలిగినా రూ. 2 లక్షల పరిహారం అందుతుంది. పాక్షికంగా అంగవైకల్యం కలిగితే రూ. 1 లక్ష పరిహారం లభిస్తుంది.

బీమాపై ఆసక్తి..

వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ పథకంలో ఇతర పనులే కాకుండా, రైతులకు ప్రయోజనం చేకూరేలా చిన్న, సన్నకారు రైతుల కోసం పశువుల పాకలు, షెడ్లు, వ్యవసాయ బావులు వంటి పనులు చేపడుతున్నారు. కూలీలకు పనులతో పాటు కేంద్ర ప్రభుత్వం సురక్ష బీమా పథకం అమలు చేయడంపై నిరుపేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకానికి అర్హులైన కూలీల వివరాలు సేకరిస్తున్నాం. వారికి జాతీయ బ్యాంకుల్లో ఖాతా లేకపోతే తెరిపించి, ఆధార్‌కార్డును అనుసంధానం చేసేలా అవగాహన కల్పిస్తున్నాం. ఉపాధి కూలీలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నిర్మల, ఫీల్డ్ అసిస్టెంట్, లింగాల

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకంలో యాక్టివ్‌గా ఉన్న జాబ్ కార్డుల కూలీలు మాత్రమే ఈ బీమా పథకానికి అర్హులు. వారి వివరాలు సేకరించాలని ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశాం. ఈ బీమా పథకానికి అమలు గడువు ఇంకా ప్రకటించలేదు. ఈ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.

– రవి, ఏపీఓ

విద్యార్థులు భాషా నైపుణ్యాలను సాధించాలి


టీఎల్‌ఎం ప్రదర్శనలో పాల్గొన్న జిల్లా రిసోర్స్ పర్సన్ ఆనందభాస్కర్, విద్యార్థులు

పెన్‌పహాడ్ : విద్యార్థులు భాషా నైపుణ్యాలను, సామర్థ్యాలను సాధించాలని హిందీ భాషా జిల్లా రిసోర్స్ పర్సన్ జి.ఆనందభాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నైతిక విలువలు అలవర్చుకోవాలని, దేశభక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను సాధించడానికి విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు హిందీ భాషలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక పోటీలు, పాటల పోటీలు, టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ప్రదర్శన అద్భుతమని పేర్కొన్నారు. అనంతరం జి. ఆనందభాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ ఆసియా జబీన్, హిందీ ఉపాధ్యాయురాలు షాహీన్ సుల్తానా, ఉపాధ్యాయులు సునీత, మనీ, భాగ్యలక్ష్మి, జానకి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన గ్రామపాలన అధికారులు


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న జీపీఓలు

తిరుమలగిరి: నూతనంగా నియామకమైన 8 మంది జీపీఓలు శనివారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్‌లను వారు శాలువాలతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. భూ భారతితో సాదాబైనామాలకు మోక్షం లభిస్తుందని తెలిపారు. 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు సాదాబైనామా దరఖాస్తులను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందని తెలిపారు. జలాల్‌పురం, మామిడాల గ్రామానికి మద్దెల మధుసూదన్, తిరుమలగిరికి నాయిని జీవన్, గుండెపురి, సిద్ధిసముద్రం గ్రామాలకు షేక్ జానిపాషా, తొండ గ్రామానికి షేక్ ఇస్మాయిల్, తాటిపాముల, నందాపురం గ్రామాలకు మంద వెంకటేశ్వర్లు, వెలిశాల గ్రామానికి ఎస్.కె.ముస్తఫా, అనంతారం, బండ్లపల్లి గ్రామాలకు ఎస్.కె.జానిమియా, మాలిపురం గ్రామానికి వి.వెంకటనాథం గ్రామ పరిపాలన అధికారులుగా నియమించబడ్డారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ కార్యవర్గ ప్రమాణస్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్స్ నూతన కార్యవర్గ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండలంలోని నెమ్మికల్‌లో శనివారం మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా అబ్బగాని మధుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బోయిని గణేష్ యాదవ్, కోశాధికారిగా మడ్డి మహేష్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లాలు, రాష్ట్ర మాజీ కార్యదర్శి సురేష్, టౌన్ అధ్యక్షుడు శేఖర్, టౌన్ మాజీ అధ్యక్షుడు రవి, ఆత్మకూరు మండల మాజీ అధ్యక్షుడు బెల్లంకొండ మల్లయ్య, కోశాధికారి వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కోదాడ నుంచి కొండాపురం రోడ్డు, రామాపురం నుంచి చిలుకూరు రోడ్డు వరకు మరమ్మతులు చేపట్టాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూసీ ఉధృతం


అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం శివారులో శనివారం ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

పాత భవనం కూల్చివేత

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో 60 సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కొత్త భవన నిర్మాణానికి ఎస్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.25 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో కొత్త భవనం నిర్మిస్తున్నందున శనివారం పాత భవనాన్ని కూల్చివేసే పనులు ప్రారంభించారు. గ్రామస్తులు పూజలు చేసి, కొబ్బరికాయ కొట్టి పాత భవనాన్ని తొలగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ఏఎంసీ డైరెక్టర్ జలేందర్, విక్రం, నిరంజన్, కుమార్, హరికృష్ణ, శేఖర్, సైదులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి

నడిగూడెం : మండలంలోని బృందావనపురం ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2009లో ప్రభుత్వం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిందని, కానీ కొద్ది సంవత్సరాల నుంచి ప్లాంట్ పని చేయడంలేదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, నాయకులు బొడ్డు వెంకటనారాయణ, ముసుకు వీరస్వామి, నారగాని కనకమ్మ, లక్ష్మి రమణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్సీ నిర్వాహకుడి మృతి

నూతనకల్ : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ సీఎస్సీ నిర్వాహకుడు సామ లింగారెడ్డి(34) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సామ లింగారెడ్డి గత ఆరు సంవత్సరాలుగా యూనియన్ బ్యాంక్ సీఎస్సీ సెంటర్‌తోపాటు ఆన్‌లైన్ సేవలను నిర్వహిస్తూ వినియోగదారులకు, రైతులకు సేవలందించారు. అతడి మృతి పట్ల పలు గ్రామాల ప్రజలు సంతాపం తెలిపారు.